## ప్రతిష్టాత్మక స్కూల్ ఎక్సెలెన్సీ అవార్డు అందుకున్న స్పందన విద్యాసంస్థ

**విశాలాంధ్ర-రాచర్ల :** బ్రెయిన్ ఫీడ్ అనే సంస్థ వారు దేశవ్యాప్తంగా ఉన్న స్కూల్స్‌లో అత్యుత్తమ విద్యనందిస్తూ విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషిచేస్తున్న అత్యుత్తమ స్కూల్స్‌కు అందించే ప్రతిష్టాత్మక స్కూల్ ఎక్సెలెన్స్ అవార్డు ఈ సంవత్సరం స్పందన విద్యాసంస్థలను వరించింది. హైదరాబాద్ హైటెక్ సిటీ నందు జరిగిన ప్రత్యేక స్పందన విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్‌రెడ్డి అందుకోవడం జరిగింది. అవార్డు తీసుకున్న అనంతరం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్పందన విద్యాసంస్థలకు బెస్ట్ స్కూల్ అవార్డ్ రావడం గర్వకారణం అన్నారు. నిరంతరం కృషి చేసిన అధ్యాపక బృందాన్ని కొనియాడారు. విద్యార్థినీ విద్యార్థులకు మరియు వారి తల్లితండ్రులకు కృతజ్ఞతాపూర్వకంగా అంకితం చేస్తున్నానని తెలియజేశారు.

# విశాలాంధ్ర
# ప్రకాశం జిల్లా

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**విశాలాంధ్ర-హనుమంతునిపాడు :** మండల పరిధిలోని హాజీపురం గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న వారిపై హనుమంతునిపాడు మండల ఎస్సై.శివ నాగరాజు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తెలిపిన వివరాల మేరకు హాజీపురం పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి పేకాట ఆడే 4 వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.32,800లు నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. కావున వారిపై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. అలానే మండలంలో ఎక్కడైనా కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం

**విశాలాంధ్ర-కొమరోలు :** అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోనేని వేంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కోమరోలు మండలం తాటిచర్ల గ్రామ పంచాయతీ నిరుపేద ఎస్సీ కుటుంబానికి చెందిన సూరే రాజమ్మ వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్తితి అని గ్రామస్తులు నిరుపేద కుటుంబంగా గుర్తించి వారికి ఆర్థిక సహాయం చేయమని అమ్మ ఫౌండేషన్ దృష్టికి తీసుకువచ్చారు. వారికి అమ్మ ఫౌండేషన్ సేవాసంస్థ కుటుంబ సభ్యుల సహకారంతో ఐదువేల రూపాయలు గ్రామస్తుల పెద్దల సమక్షంలో బోనేని వేంకటేశ్వర్లు అందచేశారు. అమ్మ ఫౌండేషన్ సేవాసంస్థ సభ్యులు అన్నపురేడ్డి మల్లికార్జునరెడ్డి, బొమ్మని రవి, పందిల్ల పుల్లయ్య, సంసాని కాశిరావు, మేకల చిన్న నరసింహులు, పాల్వది వేంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలలో కదిరి బాబురావు

**విశాలాంధ్ర-సీఎస్‌పురం :** తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలో బాలికల విభాగంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన 2023-2024 విద్యాసంవత్సరానికి సంబంధించిన రెండవ విడుత అంతర కళాశాలల క్రీడా పోటీలలో సీఎస్‌పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపించి అత్యధిక బహుమతులు కైవసం చేసుకున్నారు. బహుమతుల ప్రధానోత్సవానికి వచ్చిన జిల్లా ఏఎస్పీ జె.కులశేఖర్ ప్రాంతీయ వ్యవసాయ ఏడి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి కలిసి ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేసారు. కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగోసంవత్సరం చదువుతున్న కె.కృపా షార్ట్‌ఫుట్‌లో మొదటి బహుమతి, లాంగ్ జంప్‌లో ద్వితీయ బహుమతి, షటిల్‌లో మొదటి బహుమతి, హై జంప్‌లో ఏ. వెన్నెల ద్వితీయ బహుమతి, అదేవిధంగా 400 మీటర్స్ రన్నింగ్ లో ద్వితీయ బహు మతి బి సంకీర్తన, త్రితీయ బహుమతి ఏ వెన్నెల, బహుమతులు గెలుపొందారు. ఫిజికల్ డైరెక్టర్స్ బండారు రవీంద్ర బాబు, బి మౌనిక, విద్యార్థి వ్యవహారాల ఇంచార్జి డాక్టర్ కుమీర, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సుల్తాన్ భాష

**విశాలాంధ్ర-సింగరాయకొండ :** మండలంలోని సోమరాజు పల్లి గ్రామపంచాయతీ చెందిన షేక్ సుల్తాన్ భాష ప్రకాశం జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమతుల వటంతో ఆదివారం ఏఆర్ రఫీ కార్యాలయంలో టౌన్ అధ్యక్షుడు పటేల్ సలీం భాష అహ్మద్ కరీం తదితరులు శాలువా కప్పి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లాసెక్రెటరీగా బాలచంద్రుడు

**విశాలాంధ్ర-కొనకనమిట్ల :** వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా సెక్రెటరీగా కొనకనమిట్ల మండలంలోని పెదారి కట్ల గ్రామానికి చెందిన ముసుము బాల చంద్రుడు నియమితుల య్యారు. ఆ పదవి నాకు వచ్చినందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ ఆ పదవి వచ్చేందుకు కృషి చేసిన మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులు రెడ్డి వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు బండెల కిరణ్ రాజ్ జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి ఎంపీపీ మురళీకృష్ణ జడ్పిటిసి సభ్యుడు ఏడుకొండలు వైకాపా మండల అధ్యక్షుడు ఎం శంకర్ రెడ్డి మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెద్ద వెంకటరెడ్డిలకు బాలచంద్రుడు కృతజ్ఞతలు తెలిపారు.

## మూడవసారి కనిగిరి నియోజకవర్గ ఎమినెంట్ పర్సన్‌గా ఆకుపాటి

**విశాలాంధ్ర-పామూరు :** పదో తరగతిలో 550 మార్కులు పైబడిన ఐదు మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు ప్రోత్సాహ బహుమతిగా పామూరు పట్టణ రెండోవ ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ అందజేశారు. ఆదివారం ఒంగోలు లోని ఎం.హెచ్.ఆర్ కళ్యాణ మండ పంలో ఏపీ కాట్వా ప్రకాశం జిల్లా 9వ వార్షికోత్సవం జరిగింది. కనిగిరి నియోజకవర్గ కాట్వా ఎమినెంట్ పర్సన్‌గా ఆకుపాటి వెంకటేష్ వరుసుగా మూడవసారి ఎంపికయ్యారు. ఏపీ కాట్వా వ్యవస్థాపకులు కొల్ల నారాయణ, ఫణింద్ర కుమార్, చోడిశెట్టి శ్రీనివాస్‌రావు, జిల్లా కాట్వా సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పౌరసరఫరాల శాఖలో అవినీతి జలగలు..!

- యదేచ్ఛగా పొరుగు జిల్లాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా
- బియ్యం అక్రమ రవాణాలో అధికారుల సహకారం
- కార్యాలయానికే పరిమితమైన సివిల్ సప్లై అధికారులు
- రేషన్ షాపుల తనిఖీల ఊసే ఎత్తని అధికారులు
- ఎండియు వాహనాల ఆపరేటర్ల ద్వారా కొనుగోలు

**విశాలాంధ్ర-పీసీపల్లి :** పౌరసరఫరాల శాఖకు అవినీతి జలగలు పట్టిపీడిస్తున్నాయి పాలకులు అధికారులు మారినా పద్ధతి మాత్రం మారడం లేదు కొత్త అధికారులు వచ్చినప్పుడు కాస్త హడావుడి చేసినా ఆ తర్వాత సరామామూలే..! ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే రేషన్ బియ్యం వారికి చేరే విధంగా చూడాల్సిన అధికారులు, సిబ్బంది అవినీతి ఉచ్చులో కూరుకుపోతున్నారు. ఎండియు వాహనాల ఆపరేటర్లతో నేరుగా వాహనాల వద్దనే బియ్యం కొనుగోలు చేయించి వాహనాల ఆపరేటర్లకు ఒక కిలో కు రూపాయి పర్సంటేజీని ముట్టజెప్పి డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఒకవైపు రాజకీయ జోక్యం మరోవైపు అవినీతి జలగలతో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం యదేచ్ఛగా నల్లబజారుకు తరలిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువ య్యారు పౌరసరఫరాల శాఖలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన అవినీతి జలగలు మామూళ్ల రూపంలో రక్తం పీల్చినట్టు పీలుస్తున్నారు. రేషన్ డీలర్ల వద్ద నుండి నెల నెల ముక్కు పిండి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూసేందుకు పౌరసరఫరాల శాఖలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు డివిజన్ స్థాయి అధికారులు ఫుడ్ ఇన్స్పెక్టర్లు డిటిలు ఉన్నారు. అయితే వీరి విధి నిర్వహణను పక్కనపెట్టి వ్యాపారులతో మిలాఖత్ అవుతున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. గోదాముల నుండి రేషన్ షాప్ కు వెళ్లిన బియ్యం కార్డుదారులకు అందుతున్నాయో లేదు చూడటంతో పాటు అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు కార్యాలయానికే పరిమితమవుతూ తమ పరిధిలోని వ్యాపారులతో మిలాఖత్ అవుతున్నారు. నెల రావటమే ఆలస్యం మామూళ్ల కోసం పాకులాడుతున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతుంది. పక్క జిల్లాలకు నిత్యం ఆటోలు మినీ లారీల ద్వారా అక్రమంగా రేషన్ బియ్యం రవాణా అవుతున్నప్పటికీ అధికారులు మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో తప్ప అక్రమ రేషన్ బియ్యం పట్టుకున్న దాఖలాలు లేవు బియ్యం పట్టుకున్న సందర్భాల్లో సైతం 6ఏ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేకాక ఏ ఒక్క కేసులో నిందితులకు శిక్ష పడకపోవడం విశేషం దాంతో బియ్యం స్మగ్లర్లు కొన్ని రైస్ మిల్లు యజమానులు నిర్భయంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి మళ్లీ ప్రజలకే అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొంతమంది ప్రజలు సైతం ఎండియు ఆపరేటర్ల నుండి నుంచి బియ్యం తెచ్చుకొని వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మరి కొందరు ఏకంగా ఎండియు వాహనాల ఆపరేటర్లకు తమకు వచ్చిన రేషన్ బియ్యాన్ని 10 రూపాయలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏదైతేనేమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో 60 శాతానికి పైగా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఈపాస్ మిషన్లు అమలులో ఉండటంతో దొంగ రేషన్ కార్డులు పూర్తిగా కనుమరుగయ్యాయి. నియోజకవర్గ పరిధిలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే చిరు వ్యాపారులు బడా వ్యాపారులు అనేక మంది ఉన్నారు. ఈ బియ్యాన్ని నిత్యం ఆటోల ద్వారా మినీ లారీల ద్వారా ఇతర జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పాలక పక్ష నేతలు అధికార ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ నేతలు సొమ్ము చేసుకుంటున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తేప్పుడప్పుడు తనిఖీలు చేయడం సరుకులలో తేడాలు ఉన్నాయంటూ చర్యలు తీసుకో వటం కొద్దిరోజులకే మళ్లీ కేసులు నమోదు చేస్తున్నామని చెబుతూ రేషన్ బియ్యం అక్రమ వ్యవహారాల్లో నిన్న మొన్నటి వరకు పౌరసరఫరాల అధికారులు డీలర్లు మాత్రమే కుమ్మ క్కయి పాలుపంచుకున్నారు. తాజాగా ఇతర శాఖల అధికా రులు కూడా సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో మండల స్థాయి రేషన్ డీలర్ల సంఘాల నాయకులు కీలక పాత్ర పోషిస్తు న్నారు. ఎవరెవరు వాటాలు వారికి పంపే బాధ్యతను ఆ నాయ కులే తీసుకుంటున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యంతో అవినీతి అన్నిటి కంటే మించి దళారులు ఆధిపత్యంతో పేదల కంటే పెద్దలకు ఈ వ్యవస్థ కల్పతరువుగా మారిందేమో అనిపిస్తుంది.

## ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి

**విశాలాంధ్ర-వెలిగండ్ల :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని కనిగిరి శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ అన్నారు. ఆదివారం మోటుపల్లి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ప్రభుత్వము వర్గ భేదాలు లేకుండా అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, నాగూర్ యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సర్పంచ్ తిరుపతిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు ఎలుక రమణయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన జేమ్స్, యువత అధ్యక్షులు నాని తదితర వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొమ్మిరెడ్డిపల్లి, తాళ్లూరు గ్రామస్తులను సందర్శించిన ఎస్సై మాధవరావు

**విశాలాంధ్ర-కనిగిరి :** కనిగిరి మండలం బొమ్మిరెడ్డిపల్లి, తాళ్లూరు గ్రామాలను ఆదివారం ఎస్సై కే మాధవరావు సాధారణ విధుల్లో భాగంగా సందర్శించారు. గ్రామస్తులకు పోలీస్ చట్టాలు గురించి అవగాహన కల్పించారు. గ్రామస్తులు ఐకమత్యంతో సోదర భావంతో మెలగాలని సూచించారు.

# క్రీస్తు బోధనలు అనుసరణీయం - మంత్రి సురేష్

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ

**విశాలాంధ్ర-మార్కాపురం :** యేసు క్రీస్తు చూపిన మార్గం, ఆయన చేసిన బోధనలు అనుసరణీయమని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం రాత్రి మార్కాపురం సమీపంలో డాక్టర్ సామ్యేలా జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కేపి నాగార్జునరెడ్డితో కలిసి మంత్రి సురేష్ కేక్ కట్చేశారు. ఈ సందర్భముగా మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపి మాట్లాడుతూ క్రీస్తు బోధించిన శాంతి మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కుల, మతాలకు అతీతంగా క్రీస్తు బోధనలు పాటించి నట్లయితే సమాజంలో సుఖ సంతోషాలుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ తోటివారిపట్ల దయ, కరుణ, ప్రేమ చూపాలన్నారు. ఉత్సాహంగా సాగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ప్రిన్సిపల్ రాజబాబు, డీన్ మస్తానయ్య. పలువురు పాస్టర్లు పాల్గొన్నారు. అనంతరం కళాశాలలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కేపి నాగార్జునరెడ్డితో కలిసి మంత్రి సురేష్ కేక్ కట్చేశారు. ఈ సందర్భముగా మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపి మాట్లాడుతూ క్రీస్తు బోధించిన శాంతి మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కుల, మతాలకు అతీతంగా క్రీస్తు బోధనలు పాటించినట్లయితే సమాజంలో సుఖ సంతోషాలుంటాయన్నారు. ఉత్సాహంగా సాగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాల మురళీ కృష్ణ, ప్రిన్సిపల్ రాజబాబు, డీన్ మస్తానయ్య. పలువురు పాస్టర్లు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే. కేపి మున్సిపల్ ఛైర్మన్ బాలమురళీకృష్ణలను మంత్రి సురేష్ సన్మానించారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- ఈనెల 21,22 న అన్ని డిపోలలో ఎర్రబ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తూ భోజన విరామ సమయంలో ధర్నాలు చేస్తాం
- ఈనెల 29 న జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోలలో సామూహిక నిరాహారదీక్షలు చేపడతాం.
- ఎపిపిటిడి ఏపీపీటీడీ ఏంప్లాయిస్ యూనియన్

మాట్లాడుతున్న కె. నాగేశ్వరరావు

**విశాలాంధ్ర-ఒంగోలు :** జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయడంలో ఆర్టీసీ జిల్లా ప్రజారమవాణా అధికారి (డీపీటీఓ) ఏకపక్షంగా వ్యవహరించడమే కాకుండా, సమస్యలు పరిష్కారంలో ఉదాసీన వైఖరి, ఉద్యోగ భద్రత మార్గదర్శకాలు పాటించకుండా విచక్షణ రహితంగా ఏకరీతిలేకుండా పనిష్మెంట్లు ఇవ్వడం, అప్పీళ్లు పరిష్కరించకపోవడం జాప్యం, డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీ ఛార్టులు విషయంలో కూడా వేయించుటలో వైఫల్యం, ఉద్యోగులపట్ల పక్షపాత ధోరణి, అవకతవక బదిలీలు, తదితర సమస్యల పరిష్కారంలో ఒంగోలు డీపీటీఓకి సమస్యలతో కూడిన మెమోరాండం ఇచ్చినప్పటికీ సమస్యలు పరీష్కారంలో మొక్కుబడిగా చర్చించి పరిష్కరించకుండా ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య పూరిత ధోరణితో వ్యవహరించడాన్ని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఛీఫ్ వైస్ ప్రెసిడెంటు కె.నాగేశ్వరరావు, స్టేట్ డిప్యూటీ జెనరల్ సెక్రటరీ జి.నాగేశ్వరరావు అన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈనెల 29న జిల్లాలో అన్ని డిపోలలో ఒక్కరోజు భారీగా సామూహిక నిరహారధీక్షలు చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం చేయమైనదని ఇ.యు జిల్లా అధ్యక్షులు యస్.పోలయ్య, జిల్లా కార్యదర్శి పిడుగు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సీ.హెచ్. స్వరూపారాణీ, నెల్లూరు జోన్ ఇ.యు అధ్యక్షులు వాకా రమేష్, జోన్ సంయుక్త కార్యదర్శి బెజవాడ రవి, సహాయ కార్యదర్శి కొండలరావుతో పాటు ప్రకాశం జిల్లాలోని అన్ని డిపోల, గ్యారేజీల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు.

## అక్రమ 17 మద్యం బాటిళ్ల పట్టివేత

**విశాలాంధ్ర-హనుమంతునిపాడు :** మండల కేంద్రంలోని హెచ్ఎంపాడు గ్రామంలో ఆదివారం ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి లేకుండా 17 అక్రమ మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు హనుమంతునిపాడు మండల ఎస్సై. శివ నాగరాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు హెచ్ఎంపాడు గ్రామానికి చెందిన నాలి కొండయ్య అను వ్యక్తి వద్ద 10 మద్యం బాటిళ్లను, అదే గ్రామానికి చెందిన వాలిచర్ల చెన్నమ్మ అను ఆమె వద్ద 7 మద్యం బాటిళ్లు ఎలాంటి ప్రభుత్వం అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నారని పక్కా సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు ఉన్నట్లుగా గుర్తించారు. సదరు వ్యక్తులను అదుపు లోకి తీసుకొని వారి వద్ద ఉన్న 17 మద్యం బాటిళ్లును స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై.శివ నాగరాజు తెలిపారు.

## గనివానిపాడులో పారిశుధ్య పనులు

**విశాలాంధ్ర-కొనకనమిట్ల :** మండలంలోని గనివాని పాడు ఎస్సీ కాలనీలో సర్పంచి లక్ష్మీ సాంబ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. రోడ్లకు ఇరు వైపులు ఉన్న సైడ్ కాలువలోని మురుగును తొలగించారు. వీధులు శుభ్రం చేయించి బ్లీచింగ్ సున్నం చల్లించారు ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

## దైవ దర్శనాల్లో దారపనేని, బైరెడ్డి

**విశాలాంధ్ర-పామూరు :** నాగ పంచమి నాగపూజ ధనుర్మాసారంభం ఆదివారం సందర్భాన్ని పురస్కరించుకొని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు నెల్లూరు జిల్లా, వరికుంటపాడు మండలం, పామూరు పల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ సుబ్బరాయుడు స్వామి (నాగదేవత) షణ్ముఖం పార్వతీ పుత్రం క్రౌంచ శైలా విమర్దనం దేవసేన పతిం దేవం స్కంద వందే శివాత్మజం షష్టి మహోత్సవ పూజోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగవరపు అజిత్ కుమార్, చంద్ర రాజేశ్వరరావు, చంద్ర వెంకటేష్, దారపనేని నరసింహనాయుడు, యరసింగ్ రాయుడు, మల్లె రాహుల్ యాదవ్, జాజం హరికృష్ణ తదితరులు దైవదర్శనాల్లో పాల్గొన్నారు.

## క్రీస్తు మార్గంలో నడవాలి

సెమీ క్రిస్మస్ వేడుకలలో ప్రార్థనలో వినిపిస్తున్న పాస్టర్లు

**విశాలాంధ్ర-ముండ్లమూరు :** నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు మన్న దాన్ని ఆచరించడమే క్రీస్తు మార్గంలో నడిచినట్లు అవుతుందని పాస్టర్ ఇవాంజెలిస్ట్ గండి బెంజిమెన్ అన్నారు. మండలంలోని వేంపాడు గ్రామంలో న్యూ అపోస్తలిక్ చర్చి నందు ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బెంజిమెన్ మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న రుగ్మతలు, పేదరికం, అసమానతలపై మాట్లాడడమే క్రీస్తును అనుసరించడం అన్నారు. గురవయ్య మాట్లాడుతూ ప్రేమ, కరుణ, దయ, వంటివి ఏసుక్రీస్తులో ఇమిడి ఉన్నవని ఆయన భాషలో మనమందరం పయనించాలన్నారు. సర్వ మతాల సారాంశం ఒక్కడేనని అహింస చాటి మానవుని ప్రేమించే తత్వం అలవాడాలని ఇదే యేసు చూపిన మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల పాస్టర్లు పాల్గొన్నారు.

## ఎంపీడీవో సుకుమార్ జన్మదిన వేడుకలు

**విశాలాంధ్ర-వెలిగండ్ల :** మండలంలోనీ బాపిస్ట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు, వెలిగండ్ల ఎంపీడీవో తాతపూడి సుకుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కనిగిరి ఆర్ డి ఓ జాన్ ఇర్విన్, వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ టి రవికుమార్, హాజరై ఎంపీడీవో సుకుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సెమీ క్రిస్టమస్, ఎంపీడీవో సుకుమార్ జన్మదిన సందర్భంగా కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ టి.రవికుమార్, ఎంపీడీవో సుకుమార్ చేతుల మీదుగా ప్రజలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు అనంతరం క్రిస్మస్ దైవ సందేశం అందించారు ఈ కార్యక్రమంలో వెలిగండ్ల సర్పంచ్ సురేష్ బాబు, కనిగిరి దుర్గం బాపిష్టి చర్చి పెద్దలు మరియు గ్రామ సంఘం నాయకులు యువకులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆకాశంలో మబ్బులు ఆందోళనలో రైతులు

మొక్కజొన్న విత్తనాలపై పరదాలు కప్పిన రైతులు

**విశాలాంధ్ర-ముండ్లమూరు :** ఆకాశం మేఘావృతం కావడంతో కల్లంలో మొక్కజొన్న విత్తనాలు ఆరబోసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని ముండ్ల మూరు, పసుపుగల్లు, సింగనపాలెం, వేంపాడు, పోలవరం, భీమ వరం, మారెళ్ళ, పూరిమెట్ల, మక్కిన వారి పాలెం, జమ్మల మడక, తదితర గ్రామాలలో చినుకులు పడుతున్నాయి. ఆ సమయంలో కళ్ళంలో ఆరబోసిన మొక్కజొన్న విత్తనాలు కాపాడుకునేందుకు పొలాలకు రైతులు పరుగులు పెట్టారు. ఈ మధ్య కురిసిన మిచా ంగు తుఫాను ప్రభావం తో నష్టపోయామని. కొద్ది గొప్ప ఉన్న పంట కూడా ఈ వర్షం పడితే చేతికి వచ్చే పరిస్థితి లేదని అల్లాడిపోతున్నారు.

## నేడే మాజీమంత్రి శిద్దా రాఘవరావు నివాసంలో శ్రీ అయ్యప్పస్వామి, దుర్గ మాత అఖండ పడి భజన

**విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ :** ఈ నెల 18వ తేదీ సోమవారం సాయంత్రం 7 గంటలకు లాయర్ పేటలోని తమ నివాసంలో అయ్యప్పస్వామి, దుర్గా మాత అఖండ పడి భజన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. అఖండ పడి భజన, పూజ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, శివస్వాములు, ఆంజనేయస్వాములు మరియు భవాని మాతలు, కనక దుర్గ దేవి దీక్షా స్వాములు అందరూ ఈ భజన కార్యక్ర మంలో పాల్గొని భిక్షా మరియు స్వామి వారి తీర్థప్రసాదములు స్వీకరించి హరిహర సుతుని కృపకు పాత్రులు కాగలరని కోరుకుం టున్నట్లు శిద్దా రాఘవరావు ఒక ప్రకటనలో కోరారు.

# బీసీ సంక్షేమానికి పెద్ద పీటవేస్తున్న జగనన్న

జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ కుంచాల

**విశాలాంధ్ర-ముండ్లమూరు :** రాష్ట్రంలో బీసీల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ఆయా సామాజిక వర్గాలకి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని నూతనంగా ఎంపికైన వైసీపీ బీసీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ కుంచాల నాగరాజు అన్నారు. రాష్ట్రంలో కులగననకు ముందుకు వచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు శ్రీకారం చుట్టి రాష్ట్ర నలుమూలల బీసీలను ఏకం చేసి వారి అభివృ ద్ధికి పాటుపడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కులాల ప్రాతిపదికకు ప్రభుత్వ రిజర్వేషన్ అమలు చేయడమే కాకుండా రాజకీయంగాను అదే ప్రాతిపదికన ప్రాధాన్యత ఇవ్వడం బీసీలు గర్వించదగ్గ విషయం అన్నారు. అదే విధంగా పంచాయతీరాజ్ వింగ్ జనరల్ సెక్రటరీగా మొదుల్లవెంకట సుబ్బారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీగా కుంట అచ్చారావు, జిల్లా మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా కందిమల్ల గీతాంజలి, జిల్లా వాణిజ్య విభాగం జనరల్ సెక్రెటరీగా తాళ్ల ఇంద్రసేనారెడ్డి లను ఎన్నుకు న్నారు. జిల్లా పంచాయతీరాజ్ జనరల్ సెక్రటరీగా బద్రి వెంకట సుబ్బారెడ్డి, ప్రకాశం జిల్లా వైసీపీ యూత్ సెక్రటరీగా గర్నె పూడి ప్రసన్నకుమార్ లను ఎన్నుకున్నారు ఈ పదవి ఇప్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌కు, దర్శి వైసీపీ నాయకులు మద్దిశెట్టి శ్రీధర్ బాబుకు, మండల ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా వైసీపీ అనుబంధ విభాగంలో శ్రీనివాస రెడ్డి

**విశాలాంధ్ర-కొమరోలు :** వైసీపీ జిల్లా అనుబంధ విభాగ కమిటీల్లో కొమరోలు మండలంలో పలువురుని నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా స్టూడెంట్ వింగ్ సెక్రటరీగా దుగ్గిరెడ్డి శ్రీనివాసరెడ్డిని వైసీపీ పార్టీ నియమించింది. జిల్లా మహిళా విభాగం కమిటీలో రెడ్డిచర్ల గ్రామ సర్పంచ్ ఉమాదేవిని నియమించారు. వీరిరువురు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి, కృతజ్ఞతలు తెలిపారు.

## మోడీ పాలనలో ప్రమాదంలో భారతదేశం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : అసమర్థ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనలో భారతదేశం పెను ప్రమాదంలో పడిందని ఏపీసిసి సభ్యులు యర్రగొండపాలెం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మెడబలిమి వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం ఈవీఎంల అంకెల గారడీతో అధికారం చలాయిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం లౌకికవాదం శాంతి భద్రతలు మతసామరస్యం సోదర భావం వంటి అత్యున్నత భారత రాజ్యాంగ విలువలను అనునిత్యం ఖూనీ చేస్తూ మత విద్వేష పరిపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. ఇటీవల లోక్సభలో కొందరు వ్యక్తులు జొరబడి, దేశ అత్యున్నత చట్టసభల విధులకు భంగం కలిగించడమే కాకుండా సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం శోచనీయమన్నారు. జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదం అణచివేసామని, ఆర్టికల్ 370 రద్దు చేశామని జబ్బలు చరుస్తూ, కనుబొమ్మలు ఎగరేస్తూ నియంతలా వ్యవహరించిన హోం మంత్రి అమిత్ షా లోక్సభ పై జరిగిన అమానుషకాండకు సమాధానము ఇవ్వలేకపోతున్నాడని దుయ్యబట్టారు. దేశంలో ప్రజల మధ్య మత చిచ్చు పెడుతూ, విద్వేష పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలపై బీజేపీ ప్రభుత్వం అంతర్యుద్ధం కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. దుర్మార్గపు పరిపాలన కొనసాగిస్తున్న ఆర్ఎస్ ఎస్ అనుబంధ విభాగమైన బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళాఖాతంలో కలిపే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

## నూతన గృహప్రవేశంలో పిడతల

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని అంబవరం గ్రామానికి చెందిన జీడిపల్లి స్వామి దాస్ నూతన గృహ ప్రవేశానికి ఆదివారం వైసీపీ నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి గ్రామ ప్రజలతో మాట్లాడే గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ఈయన వెంట వైసీపీ నాయకులు ఎం.వెంకటరామిరెడ్డి, రంగారెడ్డి, శివారెడ్డి, వెంకటరామిరెడ్డి, వైసీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం - 207 మందికి వైద్యపరీక్షలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఈదు మూడి గ్రామంలో"మనం-మన ఊరు-మన ఈదు మూడి" సేవాసంస్థ వ్యవస్థాపకులు కావూరి వాసు ఆధ్వర్యంలో శ్రీరామ్ మల్టీ స్పెషాలటి ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిభిరం నిర్వహించారు. ఆదివారం జనరల్ మెడిసిన్ డాక్టరు ఎస్ ధీరజ్ బాబు, జనరల్ సర్జన్ డాక్టరు ఎస్ విజయ్ కుమార్, పెడియాట్రిక్స్ డాక్టరు వై హరికృష్ణ ప్రసాదు, జనరల్ డాక్టరు కె సౌమిత్ర పల్లవ 207మందికి ఇసిజి, ఘగర్, బీపీ, యూరిక్ యాసిడ్, నరాలు పాదాల స్పర్శ తదితర పరీక్షలు నిర్వహిం చి మందులు పంపిణీ చేసారు. శ్రీరామ్ ఆస్పత్రి మేనేజరు దాసరి సుధాకర్ యాదవ్, పిఆర్ ఓలు రవి నాగరాజు, మల్లిఖార్జున, పున్నయ్య, సిబ్బంది సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ జనరల్ సెక్రెటరీగా యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి

విశాలాంధ్ర-పీసీపల్లి : కనిగిరి నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగం జనరల్ సెక్రెటరీగా యర్రంరెడ్డి మోహన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు కృషి చేసిన కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. అధిష్టానం నాపైఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా నిర్వహించి రాబోయే ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు కృషి చెస్తానని తెలియజేశారు.

## బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర-త్రిపురాంతకం : రాష్ట్రంలో మహిళా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరీ ఎరిక్షన్ బాబు అన్నారు. మండల కేంద్రమైన త్రిపురాంతకం గ్రామంలో ఆదివారం మాజీ మండల కన్వీనర్, మరియు మాజీ సర్పంచ్ మోటకట్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎలక్షన్ బాబు పాల్గొని గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ మహిళలకు ప్రజలకు మహాశక్తి కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. పిచ్చయ్య, బాల నాసర్, వెన్నం వెంకటనారాయణ, సైదావలి గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లోకానికి ప్రేమ సందేశమే క్రిస్మస్ : మారెళ్ళ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : లోకానికి ప్రేమ సందేశమే క్రిస్మస్ పండుగ అంతరార్థమని ప్రముఖ సంఘ సేవకులు మారెళ్ళ సుబ్బారావు అన్నారు. ప్రపంచం అంతటికీ లోక రక్షకుడు ఏసుక్రీస్తని, ఆయన ప్రేమ, దయ, శాంతి, కరుణ సందేశాన్ని లోకానికి అందించారన్నారు. ఏసు ప్రభువు చెప్పినట్లు సమాజంలో శాంతి, సహనంతో మానవులు మెలగాలని పిలుపునిచ్చారు. రావి ఆంజనేయులు వీధిలో ఉన్న గుడ్ న్యూస్ మినిస్టరీ అందుల పాఠశాలలో ఆదివారం సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు ఫ్రాన్సిస్ మాణిక్యమ్మ జ్ఞాపకార్థం ఆశాజ్యోతి, కవిత యువరాజ్, బ్లెస్సీల ఆధ్వర్యంలో జరిగినది. ముఖ్య అతిథిగా దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ హాజరై క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా అంద విద్యార్థులకు నూతన వస్త్రాలు, కేకు కటింగ్, భోజనం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు మోహన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఒమ్మెవరం ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి బెనహర్ పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. 24వ వార్డు క్లస్టర్ వాలంటీర్ ఈ మణి బాబు బిదిలీ పెన్షన్లు సృష్టించి అక్రమంగా నగదు వసూలు చేస్తుండగా పంచాయతీపాటు కార్యదర్శి బెనహర్‌కు తెలపగా పట్టించుకోపోవడంతో ఆ వాలంటీర్ పరిధిలోని వార్డు సభ్యుడు పొట్టేటి అశోక్ జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మండల పరిషత్ నిధులతో గ్రామంలోని ఓ నాయకుడు తన ఇంటి ప్రాంగణంలో తాగునీటి బోరు ఏర్పాటు చేసుకుని ప్రజలకు త్రాగునీరు అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. గ్రామ నాయకుడు వేసిన బోరుకు సమీపంలో కేవలం 25 మీటర్ల దూరంలోనే గతంలో ప్రభుత్వం మరొక త్రాగునీటి బోరును ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అంత తక్కువ దూరంలో రెండు బోర్లు ఏర్పాటు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని గ్రామానికి చెందిన గండు హరిబాబు దొడ్డక వెంకట సుబ్బారావు పిర్ల రంగారావు నల్లూరి సుబ్బయ్య నల్లూరి ప్రమోద్ నల్లూరి రమేష్ ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన మరో వాలంటీర్ ఉప్పుగుండూరు ప్రైవేటు స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ గత ఏడు నెలల నుండి పంచాయతీ సమావేశాలకు హాజరుకాకుండా తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందన్నారు ఆమెపై కుమ్మక్కైన పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీలో వసూళ్లు చేసిన ఇంటి పన్ను రసీదులు పుస్తకాలను భద్రం చేయాల్సిన పంచాయతీ కార్యదర్శి బెనహర్ బిల్ బుక్ లు కనిపించడం లేదని సాకులు చెబుతూ ఇంటి పన్నులు వసూలు చేసిన నగదును సక్రమంగా ట్రెజరీకి జమ చేయలేదని పలువురు వార్డు సభ్యులు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతోపాటు ఇంటి పన్ను వసూళ్లలో బెనహర్ పై అవినీతి ఆరోపణలు ప్రజలు గుప్పిస్తున్నారు. దానిపై పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించాలని కార్యదర్శిని పలువురు వార్డు సభ్యులు కోరగా స్పందించకుండా సాకులు చెబుతున్నాడని ఆరోపిస్తున్నారు ఇదే విషయాన్ని ఎంపీడీవో జయమణి దృష్టికి తీసుకువెళ్లగా ఆమె సైతం పంచాయతీ కార్యదర్శికి వత్తాసు పలుకుతూ ప్రజల సొమ్ముకు జవాబుదారీగా ఉండాల్సి ఉండగా సమాధానం చెప్పటం లేదని వార్డు మెంబర్లు నక్కల పార్వతి పొట్టేటి అశోక్ నల్లూరి కుసుమ ఆరోపిస్తున్నారు. ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శి తీరుపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు వివరించారు. పంచాయతీ కార్యదర్శి బెనహర్ పై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు వార్డు సభ్యులు గ్రామస్తులు కోరుతున్నారు. వార్డు మెంబర్లు గ్రామస్తులు ఆరోపిస్తున్న విషయాలపై పంచాయతీ కార్యదర్శి బెనహర్ ను విశాలాంధ్ర జాతీయ దినపత్రిక వివరణ కోరగా తాను 2023 జూలైలో ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు తీసుకోవడం జరిగిందన్నారు అప్పటినుండి ఇంటి పన్ను వసూళ్ల బిల్ బుక్ లు తన వద్ద ఉన్నాయన్నారు. వార్డు మెంబర్లు, గ్రామస్తులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. వాలంటీర్లు నకిలీ పెన్షన్లు సృష్టిస్తున్నట్టు ఆధారాలతో తన దృష్టికి తీసుకువస్తే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఉపాధ్యాయులు మానసిక సంఘర్షణతో పనిచేస్తున్నారు

- పల్లె బడులు మూతపడ్డాయి
- సీపీఎస్ రద్దు చేయడంలో మాట తప్పిన ముఖ్యమంత్రి
- ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. సాయి శ్రీనివాస్
- తెదేపా అధికారంలోకి వస్తే ఉపాధ్యాయులకు మంచి రోజులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

విశాలాంధ్ర-కనిగిరి : వైసీపీ పాలనలో ప్రభుత్వ ఉపాధ్యాయులు మానసిక సంఘర్షణతో పనిచేయాల్సి వస్తుందని, విద్యార్థులకు మానసిక స్థాయికి అనుగుణంగా బోధించడంతో పాటు విభిన్నమైన యాప్‌ల ద్వారా ఫోటోలు పంపడం భారంగా మారిందని రాష్ట్ర ఎస్టీయు అధ్యక్షుడు ఎల్ సాయి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించడంతో విద్యా ప్రమాణాలు పడిపోయాయి అన్నారు. పల్లె బడులు మూతపడ్డాయని, వేల సంఖ్యలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయన్నారు. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల్లో తనిఖీలు చేసి ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేయటం తగదన్నారు. తూర్పు రాయలసీమ పట్టభద్రులు నియోజకవర్గం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ తెదేపాయంలో ఉపాధ్యాయులకు డిఏ,ఐఆర్, ఇంక్రిమెంట్లు నగదు ఎప్పుడు ఖాతాలో జమ అవుతాయని ఎదురుచూసే వాళ్ళని, వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రతి నెల ఒకటో తేదీ జీతం పడుతుందా..? లేదా..? అని ఎదురు చూడాల్సిన పరిస్థితి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కల్పించడం హాస్యాస్పదమన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మున్సిపాలిటీ కార్మికులను, అంగన్వాడీ, నిరుద్యోగులను మోసం చేసిందని ఉపాధ్యాయులు పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్, జిల్లాఅధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బిసి హెచ్.వెంకటేశ్వరరావు, ఆరు మండలాల ఎంఈవోలు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసిన్, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, సీనియర్ ఎస్టీయు నాయకులు కనిగిరి జోన్ ఎస్టీయునాయకులు పాల్గొన్నారు.

## తహాసీల్దార్ కార్యాలయం బయట బల్లలు తొలగింపు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరులోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రజల సౌకర్యార్థం దాతలు ఏర్పాటుచేసిన సిమెంటు బల్లలు తొలగింపు విమర్శలకు దారితీస్తుంది. వివరాల్లోకి వెళితే ముళ్ళమూరు తహసిల్దార్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్ కార్యాల యం ఆవరణలో పలువురు దాతలు దశాబ్ద కాలం క్రితం నుంచి ప్రజల సౌకర్యార్థం అక్కడ ఉన్న చెట్ల కింద సిమెంట్ బల్లులు ఏర్పాటు చేశారు. దీంతో పలు ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ రకాల పనులు పై వచ్చికార్యాలయంలోని పనులు చేసు కొనేందుకు అధికారుల వద్దకు వస్తారు. అధికారులు రాని సమయంలో ఆ బల్లలపై కూర్చుని వేచి చూస్తూ ఉంటారు. అయితే ఆ బల్లలువద్దకు వచ్చి పిచ్చాపాటిగా మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తూ ఉంటారు. అయితే ఇటీవల 13వ తేదీ నా ఏసీబీ అధికారులు ఆకస్మికదాడి చేసి లంచం తీసుకుంటున్న విఆర్‌ఓను పట్టుకున్నారు. ప్రజలు తమ శాఖలలో జరిగే లోపాలను బల్లలుపై కూర్చొని చర్చించుకో వడంతో ఏసీబీ అధికారుల వరకు విషయం బ పొక్కిందని అసలు బల్లలేలేకుండా చేస్తే ప్రజలు లబ్ధిదారులు కార్యాలయా వద్ద ఉండే అవకాశం ఉండదు కనుక తమకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని రెవెన్యూ అధికారులు భావించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రజల సౌకర్యార్థం తిరిగి బల్లలను ఆయా ప్రాంతంలో ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వాలి

- దళిత నేత నీలం నాగేంద్ర రావు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: ఇటీవల గ్రూప్ 2 ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చిన జగన్ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ ఉద్యోగాల నోటిఫికేషన్ కూడా వెంటనే ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర రావు డిమాండ్ చేశారు. ఆదివారం తన కార్యా లయంలో జరిగిన విలేకర్ల సమావేశం లో నీలం నాగేంద్రరావు మాట్లాడుతు ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల నోటిఫికేషన్ జగన్ ప్రభుత్వంలో ఎండమావిగా మారిందన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత 2జులై 2021సంవత్సరంలో జీవో నెంబర్ 181 ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో ఉన్న 1238 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. అందులో జిల్లాల వారీగా శాఖల వారీగా ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ నోటిఫికేషన్ ను ఇచ్చారన్నారు. అందులో కూడా ప్రకాశం జిల్లాలో ముఖ్యంగా డ్రైవర్ పోస్టులు 24 ఎస్సీ,ఎస్టీ 9 మొత్తం కలిపి 33 పోస్టులు ఇచ్చారన్నారు. అలాగే కుక్ అటెండర్ వాచ్‌మెన్ లాంటి పోస్టులు 32 అందులో 18 ఎస్టీలకు 14 ఎస్సీ లకు ఇచ్చార న్నారు. అప్పటినుండి ఇప్పటివరకు మరల బ్యాక్ లాగ్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వలేద న్నారు. జీవో నెంబర్ 102 ద్వారా జనరల్ అడ్మినిస్ట్రేషన్ సెప్టెంబర్ 25 వ తేదీ 2023 సంవత్సరం న జగన్ ప్రభుత్వం మరల మార్చి 31 వ తేదీ 2024 సంవత్సరం వరకు బ్యాక్ లాగ్ పోస్టుల నోటిఫికేషన్ ను ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డీ మార్చారన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్థుల 58 సంవత్సరాలు ఉన్న రిటైర్మెంట్ వయసును మరల 60 సంవత్సరాలకు మార్చారన్నారు. మరల వారికి ఇవ్వాలిసిన బెనిఫిట్స్ ఇవ్వలేక మరల జగన్ ప్రభుత్వం ఉద్యోగస్థుల రిటైర్మెంట్ వయసుని 62 సంవత్సరాలకు పెంచిందన్నారు. ఈ సమావేశంలో దళిత అధ్యక్షులు దార అంజయ్య, తానికొండ ఆనంద్, కాకుమాను రవి, పాలేటి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

## బట్టలు నిత్యవసర వస్తువులు పంపిణీ : వైస్ ఎంపీపీ

విశాలాంధ్ర-గిద్దలూరు : స్థానిక టెన్నిస్ కోర్ట్ ఆవరణలో కార్డ్స్ బాలబాట అభివృద్ధి కార్యకర్తలకు శనివారం వైస్ ఎంపీపీ బండారు నోవెల్ నూతన వస్త్రాలు,నిత్యవసర సరుకులు 30 మంది కార్యకర్తలకు అందించడం జరిగింది. బాలబాట డిప్యూటీ డైరెక్టర్ ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ పేద వర్గాల పిల్లలకు ఈ బాలబాట ఎంతో బాసటగా నిలిచాయని విద్యను వారికి చేరువ చేశాయని ఎక్కడైతే పిల్లలు విద్యకు దూరంగా ఉంటారో ఆ ప్రాంతాలలో బాలబాటలను ఏర్పాటు చేసి తద్వారా డ్రాప్ అవుట్ విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిని గమనించి స్కూలులో చేర్పించి డ్రాప్ బోర్డు శాతాన్ని తగ్గించవచ్చన్నారు. పల్నాడు జిల్లా బాలబాట డిప్యూటీ డైరెక్టర్ జి సుబ్బారావు మాట్లాడుతూ నేడు పోటీ ప్రపంచంలో విద్య ప్రధానం అని ఆ విద్య ద్వారానే తారతమ్యాలు రూపుమాపు తాయని అన్నారు. అలాగే పిల్లలందరూ కూడా చక్కగా చదివి తల్లిదండ్రులకి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గిద్దలూరు వైస్ ఎంపీపీ బండారి నోవెల్ చేతుల మీదుగా హాజరైన బాలబాట అభివృద్ధి కార్యకర్తలందరికీ వస్త్రాలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. రాచర్ల ఏరియా కోఆర్డినేటర్ ఎస్ ఓబులేషు అధ్యక్షతన నిర్వహించబడినది. ముఖ్య అతిథులుగా గిద్దలూరు వైస్ ఎంపీపీ బండారి నోవెల్, జిల్లా బాలబాట డిప్యూటీ డైరెక్టర్ యం. నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా బాలబాట డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు తదితరులు పాల్గొనడం జరిగింది.

## మహిళల సమస్యలు - కర్తవ్యాలు" అంశంపై రాష్ట్ర సదస్సు

సమావేశంలో మాట్లాడుతున్న విజయ

విశాలాంధ్ర-ఒంగోలు : స్త్రీ విముక్తి సంఘటన అధ్వర్యంలో స్థానిక వేమూరి కళ్యాణ మండపంలో ఈనెల 24వ తేదీన మహిళా సమస్యలు కర్తవ్యాలు అనే అంశంపై రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు సి విజయ, ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మీ, ఎపి రైతుకూలి సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్ లలితకుమారి, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా అధ్యక్షులు రేణుక, ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఒక పేర్కొన్నారు. సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా వున్న మహిళలు రైతుకూలీలుగా, చిన్న, సన్నకారు రైతులుగా, అసంఘటిత రంగ శ్రామికులుగా చాకిరీ చేస్తూ తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. దీనితోపాటు అడుగడుగునా పితృస్వామ్య పీడన, అణచివేతలకు బలవుతున్నారు. వ్యవసాయ, పారిశ్రామిక , ఇతర వుత్పాదక రంగాల్లో మరియు సేవారంగాల్లో దశాబ్దాలుగా పాలకులు అనుసరిస్తున్న విధానాలు ప్రజల జీవితాల్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టేసాయి. సరైన ఉద్యోగాలను, ఉపాధిని కల్పించడం లేదు. ఉపాధి లేమి, నిరుద్యోగ సమస్య, వలసలు తీవ్రమౌతున్నాయి. పెట్రోలు, డీజిలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. వీటన్నింటి దుష్ఫలితాల ప్రభావం అంతిమంగా మహిళలపైనే అత్యధికంగా ఉంటున్నదన్నారు. అంగన్వాడీ మహిళలు జీతాలు పెంచాలనీ, రిటైర్ అయ్యాక గ్రాట్యూటీ లాంటి సదుపాయం కల్పించాలనీ, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ డిమాండ్ చేస్తూ ఆందోళన సాగిస్తున్నారు. కానీ ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకుండా ఉద్యోగాల నుండి తొలగిస్తానని బెదిరిస్తున్నది. పాలకుల ఈ చర్యను ఖండిస్తున్నాం. తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన సాగిస్తున్న ఆశా వర్కర్ల, అంగన్వాడీ ఉద్యోగుల ఆందోళనకు సంఘీభావాన్ని ప్రకటిస్తున్నామన్నారు.నేడున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు మహిళల జీవితాలను రోజురోజుకూ కష్టాలమయం చేస్తున్నాయి. మహిళలు ఏ రంగంలో ఉన్నారనే దానితో నిమిత్తం లేకుండా లైంగిక వేధింపులు, హింస తీవ్రమౌతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళల సమస్యలు - కర్తవ్యాలు అనే అంశంపై ఈనెల 24వ తేదీన ఒంగోలులోని వేమూరు కళ్యాణ మండపంలో స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చెయ్యాలని కోరుతున్నామన్నారు. ఈ సభలో డా. సి.విజయ (అధ్యక్షులు, స్త్రీ విముక్తి సంఘటన), సిహెచ్. మంజుల (రాష్ట్ర అధ్యక్షులు, ఏపీటీఎఫ్), డా. నీరద (అడిషనల్ డైరెక్టర్ (రిటైర్డ్), వైద్య, ఆరోగ్య శాఖ), ఎస్.ఝాన్సీ (రాష్ట్ర అధ్యక్షులు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.), వి.హనుమంతరావు (ప్రధానకార్యదర్శి, ఓపిడిఆర్), ఓవీయస్ రామకృష్ణ (రాష్ట్ర సహాయకార్యదర్శి, జనసాహితి) ఎం.లక్ష్మి (ప్రధానకార్యదర్శి, స్త్రీ విముక్తి సంఘటన),ఎస్. లలితకుమారి (రాష్ట్ర కోశాధికారి, రైతుకూలీసంఘం (ఆం.ప్ర)), ఎన్.భాస్కర్ (రాష్ట్ర అధ్యక్షులు, పిడిఎస్ఓ) తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు.

## లాల్ నీల్ మైత్రి నేటి చారిత్రక అవసరం పుస్తక ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు: లాల్ నీల్ మైత్రి నేటి చారిత్రక అవసరం పుస్తకాన్ని ఒంగోలులోనే మంచి పుస్తకం షాపు దగ్గర ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు మాట్లాడుతూ ప్రపంచంలోనే ఏ దేశంలో లేని కుల వ్యవస్థ భారతదేశంలో ఉందని దీన్ని పరిష్కరించడానికి మార్క్సిస్టుశక్తులు, అంబేద్కర్ వాదులు కలసికట్టుగా ముందుకు సాగాలని ఆయన అన్నారు, మార్క్సిస్టు దృక్పథంతో వర్గ పోరాటాలను నిర్మించడానికి పూనుకున్నప్పటికీ అనేక త్యాగాలను చేసి వర్గ పోరాటాలు నిర్మించారన్నారు. అనేక త్యాగాలను చేసినప్పటికీ కుల వివక్షతలో కుల నిర్మూలను రూపుమాపకపోగా వర్గ పోరాటాలకు ఆటంకంగా నిలిచింది. అంబేద్కర్ వాదులు కేవలం కుల నిర్మూలన కోసమే పని చేస్తూ దోపిడీపీ నలను పట్టించుకోలేదన్నారు.ఫలితంగా ఈ రెండు శిబిరాల్లో చీలికల పరంపర కొనసాగుతుందన్నారు.ఈ రెండు శిబిరాలు శత్రువులుగా కొనసాగటం సరైనది కాదని రెండు శిబిరాలు ఏకంగా ఒక తాటిపైకి వచ్చి వర్గ కుల పోరాటాలను పదును ఎక్కించాల్సిన చారిత్రక అవసరం గుర్తించి ఈ వ్యాసాల సంకల్నాన్ని లాలీలు మైత్రి నేటి చారిత్రక అవసరం ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి మేడికొండ జార్జి, ఐఎల్పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కొంగర నరసింహం, ఏ పి టీ ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి పి వి సుబ్బారావు, బౌద్ధ ప్రచార వేదిక నాయకులు హరిప్రసాద్ అల్లు వెంకటేశ్వర్లు, దేశభక్తి యుత ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి వెంకయ్య ,సిపిఐ నాయకులు ప్రభాకర్, కార్మిక నాయకులు వీ శివరావు, అరుణోదయ నాయకులు శామ్యూల్, ప్రజా కళామండలి నాయకులు నరసింహారావు, ప్రజా రచయిత రెబ్బవరపు ఉదయ్, బహుజన ఉద్యోగ సంఘం నాయకులు విశ్వ మానవ సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి కొటారి జనార్ధన్, బహుజన వేదిక నాయకులు ఎం రమేష్, బౌద్ధ వేదిక నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

## బాధితునికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని లక్ష్మక్కపల్లి పంచాయతీ పరిధిలోని గుంటూరు లింగన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు అత్యాల జేమ్స్ ఇటీవల అనారోగ్యానికి గురై తిరుపతి రియా వైద్యశాలలో ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని వారిని పరామర్శించిన తెలుగు దేశం పార్టీ నాయకులు ఆర్థిక సహాయం నిమిత్తం యువ వ్యాపారవేత్త కడప ఓబుల్ రెడ్డి రూ. 10 వేలు గ్రామ టీడీపీ కమిటీ అధ్యక్షులు కోటపాటి రామారావు రూ. 10వేలు గుంటూరు లింగన్న పాలానికి చెందిన బెంగళూరులో వ్యాపారం చేస్తున్న కరణం వెంకటేశ్వర్లు రూ.10 వేలు రూపాయలు మొత్తం 30 వేల రూపాయలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేమూరి రామయ్య సమక్షంలో బాధితుడుకి అందజేశారు. మాజీ సర్పంచ్ కోటపాటి మాల్యాద్రి ఒంగోలు పార్లమెంట్ బీసీ సెల్ కార్యదర్శి కోమటిగుంట్ల వీరయ్య ముప్పవరపు మాచర్ల గుంటగాని జోసెఫ్ వీరపనేని నానిబాబు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన చేరెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని ముత్తుముల భాస్కర్‌రెడ్డి కల్యాణ మండపంలో శనివారం జరిగిన శీలం వివాహ వేడుకలో వైసీపీ సీనియర్ నాయకుడు చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని తంబళ్లపల్లి గ్రామానికి చెందిన శీలం శివశంకర్‌రెడ్డి, విజయ లక్ష్మి దంపతుల కుమారుడు రామ్‌మోహన్‌రెడ్డి, వివాహ వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకలో మాజీ ఎమ్మెల్యే పిడతల సాయి కల్పనారెడ్డి, వైసీపీ నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, యమ్ పి.పి.కడప లక్ష్మి, మాజీ యమ్ పి పి కడప వంశీధర్‌రెడ్డి, డాక్టర్ చేరెడ్డి రంగారెడ్డి, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ జెవి నారాయణ, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు వైసీపీ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండల కేంద్రమైన సీఎస్ పురంలో బూత్‌నెంబర్ 84 నందు మరియు ముండ్ల పాడు బూత్ 68లో టీడీపీ కనిగిరి ఇన్‌ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మండల పార్టీ అధ్యక్షులు బొమ్మన బోయిన వెంగయ్య ఆదేశాల మేరకు ఆదివారం ఇన్‌ఛార్జ్‌లు రుసుంషాను, గజ్జల కోటిరెడ్డితో సీఎస్‌పురం మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ షేక్ రజ్జబ్ బాషా ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటి కార్యక్రమం నిర్వహించారు. రుసుం ఖాజావలి పాల్గొన్నారు.

## ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు : అఖిల భారత బిఎస్ఎన్ఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా జరిగింది.స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తొలుత అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ అంజయ్య చేత పతాకావిష్కరణ అనంతరం పెన్షన్ కు మూల కారకులు అయిన డి.ఎస్.నకారా చిత్రపటానికి సీనియర్ కామ్రేడ్ బి.వి సురేష్ కుమార్‌తో పాటుగా పలువురు బిఎస్ ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులు మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ నాగేశ్వరరావు మాట్లాడుతూఈరోజు పెన్షనర్లందరూ పెన్షన్ తీసుకుంటూ వృద్ధాప్యంలో హాయిగా జీవిస్తున్నారంటే, ఇండియన్ డిఫెన్స్ సర్వీసులో ఫైనాన్స్ అడ్వైజర్‌గా ఉద్యోగం చేస్తూ1972లో రిటైర్ అయిన డి.యస్.నకారా చలవేనని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయ కులు కె. అంజయ్య, బి.వి సురేష్ కుమార్, పి తిరుపతి స్వామి, కె.వెంకటేశ్వర్లు మిడసల మల్లికార్జునరావు ప్రసంగించారు.

## అంగన్వాడీ సమ్మెలోకి కేంద్ర కార్మిక సంఘాల ప్రత్యక్ష పోరాటం

విశాలాంధ్ర-ఒంగోలు: అంగన్వాడీ సమ్మెలో ప్రత్యక్షంగా కార్మిక సంఘాలు పాల్గొననున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పీవీఆర్ చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. గత 12వ తేది నుంచి అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారానికి నిరవధికంగా సమ్మె చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ప్రభుత్వం చర్చల పేరుతోటి కాలయాపన చేసి పరిష్కారం చేయలేమని చేతులెత్తేయడం జరిగింది. అంతేకాకుండా అంగన్వాడీ సెంటర్లు తెరిపించాలని కాంటాక్ట్ కార్మికులు, వీఆర్ఏలు, సచివాలయ ఉద్యోగుల, చేత తాళాలు పగలగొట్టడం చేయడం జరిగింది. ఇది కరెక్ట్ పద్ధతి కాదు ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం నిర్బంధాన్ని ప్రయోగించడం బెదిరింపులకు పాల్పడటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు 18వ తేదీ నుండి ప్రత్యక్షంగా పాల్గొనాలని నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో ప్రకాశం జిల్లాలో కూడా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటాయని శ్రీనివాసులు, పీవీఆర్ చౌదరి తెలియజేయడం జరిగింది.

## జనసేన పార్టీలోకి యువకుల చేరిక

విశాలాంధ్ర-కంభం : జనసేన పార్టీ గిద్దలూరు నియోజకవర్గం లోని కంభం మండల అధ్యక్షుడు తాడిశెట్టి ప్రసాద్ ఆద్వర్యంలో ఆదివారం జనసేన పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇంఛార్జి బెల్లంకొండ సాయిబాబు సమక్షంలో తురిమెళ్ళ గ్రామం నుండి పది కుటుంబాల యువకులు జనసేన పార్టీలో చేరడం జరిగింది. తురిమెళ్ల గ్రామంలో జనసేన పార్టీ కోసం పని చేసి జనసేన పార్టీ విజయానికి కృషి చేస్తామని యువకులు హామీ ఇవ్వడం జరిగింది.ప్రస్తుత రాజకీయలలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అయితేనే నిరుద్యోగ సమస్య తీరుతుందని, గ్రామ యువకులు తెలిపారు. జిల్లా కార్యదర్శి లంకా నరసింహారావు, కంభం మండల అధ్యక్షుడు తాడిశెట్టి ప్రసాద్,ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి లోకేష్, బెస్తవారపేట గ్రామ పార్టీ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.